సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



పోచమ్మకు బోనం

వేములవాడ: వేములవాడ బద్దిపోచమ్మ వద్ద శుక్రవారం రద్దీ నెలకొంది. శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.



పోషకాల 'ఫోర్టిఫైడ్'

జిల్లాలో ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీకి సిద్ధం అవుతున్నారు. ఈనెల నుంచే పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా ఉంటుంది. పగటి పూట ఎండ తీవ్రత పెరుగుతుంది.

ఎక్కువగా నమ్మటం, ఎక్కువగా ప్రేమించటం, ఎక్కువగా ఆశించటం ద్వారా వచ్చే బాధ కూడా ఎక్కువగానే ఉంటుంది.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శని: 6:33	ఆది: 4:45

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

అభివృద్ధి ప్రధాన ఎజెండా



మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సిరిసిల్లటౌన్: పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సకల చర్యలు తీసుకుంటోందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. శుక్రవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. మొత్తంగా 23అంశాలతో కూడిన ఎజెండాను సభ్యులు ఆమోదించినట్లు పేర్కొన్నారు. రూ.15.35 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ పచ్చజెండా ఊపిందన్నారు. రూ.8కోట్లతో పెద్దూరులో రెండు మోడల్ లేఅవుట్లు, రూ.4.50కోట్లతో రెండో బైపాస్‌రోడ్డులో సెంట్రల్ లైటింగ్, రూ.8.50లక్షలతో స్వచ్ఛసర్వేక్షణ్–2023 పనులు, రూ.2లక్షలతో ఈద్గాలు, ప్రార్థన మందిరాల్లో మౌలిక వసతుల కల్పన, తదితర పనులను చేపడుతున్నామన్నారు. 100 శాతం ఇంటిపన్నులు వసూళ్లు చేసిన కౌన్సిలర్లను సన్మానించారు. కమిషనర్ వెల్దండి సమ్మయ్య, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ఉన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న పర్శ హన్మండ్లు

గంభీరావుపేట(సిరిసిల్ల): హక్కుల సాధన, రాజ్యాధికారంలో వాటా కోసం ముదిరాజ్‌లు ఐక్యంగా ఉద్యమించాలని, అందుకు తాను ముందువరుసలో ఉంటానని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు అన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన హన్మండ్లుకు గంభీరావుపేట మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సన్మానసభ ఏర్పాటు చేశారు. హన్మండ్లు మాట్లాడుతూ.. గతంలో రెండు సందర్భాల్లో జైలుకెళ్లి వచ్చానని, ఇప్పుడు ముదిరాజ్ సమస్యల పరిష్కారం కోసం మూడో సారి జైలుకెళ్లడానికి సిద్ధమేనన్నారు. ముదిరాజ్‌లను బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ' గ్రూప్‌లోకి మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. హన్మండ్లును సంఘ సభ్యులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. మండలశాఖ అధ్యక్షుడు వీరబోయిన రమేశ్, ప్రధాన కార్యదర్శి శాత్రబోయిన లక్ష్మణ్, నర్సయ్య, బాబు, నాగారపు దేవేందర్, వెంకటస్వామి, రాజేందర్, నర్సింలు, బాలవ్వ, సంజీవ్, లక్ష్మణ్, దేవదాస్ ఉన్నారు.

ఆధార్ కార్డు అప్డేట్ చేసుకోవాలి

సిరిసిల్లఅర్బన్: 2015 కన్నా ముందు ఆధార్ కార్డు పొందిన వారందరూ మరోసారి ఆధార్ కార్డును అప్డేట్ చేసుకోవాలని జిల్లా ఈ–డిస్ట్రిక్ మేనేజర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ అప్‌డేట్ కోసం ప్రతిగ్రామంలో క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2015 సంవత్సరం కన్నా ముందు ఆధార్‌కార్డు కలిగి ఇప్పటి వరకు అప్‌డేట్ చేసుకొనివారు తప్పని సరిగా అప్డేట్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్‌పాస్ బుక్ తదితర గుర్తింపుపత్రాలతో ఆధార్ క్యాంప్‌కి వెళ్లి అప్డేట్ చేసుకోవాలని సూచించారు.

పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సిరిసిల్లఅర్బన్: గీత వృత్తిని నమ్ముకొని ప్రమాదంలో మృతిచెందిన, శాశ్వత వైకల్యం పొందిన బాధిత కార్మిక కుటుంబాలకు రావాల్సిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే చెల్లించాలని జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గీతవృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నవారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. బాధితులకు మూడేళ్ల నుంచి ఎక్స్‌గ్రేషియా రాలేదని తెలిపారు. ఎక్స్‌గ్రేషియా కోసం చాలాసార్లు అబ్కారీశాఖ అధికారులను సంప్రదించినా ఫలితం లేదన్నారు. అధికారులు, మంత్రి కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ స్పందించి ఎక్స్‌గ్రేషియా వచ్చే ధంగా చూడాలన్నారు.

ఆగస్టులో అడ్మిషన్లు

- మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం 100 సీట్లు
- స్థానికులకే 85శాతం కేటాయింపులు
- కాలేజీకి ఎల్‌వోపీ ఇంకా రావాల్సి ఉంది
- మెడికల్ కాలేజీ భవనం నిర్మాణంలో ఉంది
- అద్దె భవనాల్లో హాస్టళ్ల ఏర్పాట్లు
- కాలేజీకి 55 మంది సిబ్బంది కేటాయింపు
- 'సాక్షి'తో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్



సాక్షి ఇంటర్వ్యూ

సిరిసిల్ల: జిల్లాకు ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కాలేజీలో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభిస్తామని, ఆగస్టు నెలలో అడ్మిషన్లు జరుగుతాయని మెడికల్ కాలేజీ తొలి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పెద్దూరు బైపాస్ రోడ్డులో మెడికల్ కాలేజీ భవనం, హాస్టల్ నిర్మాణంలో ఉన్నాయన్నారు. మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం వంద మంది విద్యార్థులకు వైద్యవిద్యను బోధిస్తామని శుక్రవారం 'సాక్షి'కి వెల్లడించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

ఎల్‌వోపీ రావాల్సి ఉంది

ప్రభుత్వ పరంగా సిరిసిల్లకు మెడికల్ కాలేజీ మంజూరైంది. ఈ ఏడాది విద్యా సంవత్సరంలోనే తరగతులు ప్రారంభించాలంటే నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) నుంచి లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌వోపీ) రావాల్సి ఉంది. అది వస్తేనే మెడికల్ కాలేజీకి అన్ని అనుమతులు వచ్చినట్లు. ఎన్‌ఎంసీ బృందం ఢిల్లీ నుంచి ఎప్పుడు వస్తుందోనని చూస్తున్నాం. 340 బెడ్స్ హాస్పిటల్ అందుబాటులో ఉంటేనే మెడికల్ కాలేజీకి అనుమతిస్తారు. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో రెండో అంతస్తులో కొత్తగా స్లాబ్ పోశారు. అక్కడ కొత్తగా మరో 120 బెడ్స్ అందుబాటులో ఉంటాయి. మొత్తం కలిపి సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో 340 బెడ్స్ ఉన్నాయి.

మొదటి ఏడాది వంద సీట్లు

సిరిసిల్ల మెడికల్ కాలేజీలో మొదటి ఏడాది వంద సీట్లు ఉంటాయి. ఇందులో 15 శాతం అంటే 15 సీట్లు ఆల్ ఇండియా కోటాలో కేటాయిస్తారు. అన్ని ప్రాంతాలకు చెందిన వారు ఈ సీట్లు పొందుతారు. 85శాతం సీట్లు స్థానికులకే కేటాయిస్తారు. తెలంగాణాలోని అన్ని జిల్లాల అభ్యర్థులకు అవకాశం లభిస్తుంది. 40 శాతం సీట్లు బాలురకు, 60 శాతం సీట్లు బాలికలకు ఉంటాయి. జూన్, జూలై నెలల్లో కౌన్సెలింగ్ ఉంటుంది. ఆగస్టులో తరగతులు ప్రారంభిస్తాం.



పెద్దూరు బైపాస్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ భవనం

సొంత భవనంలోనే తరగతులు

సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరు బైపాస్ రోడ్డులో మెడికల్ కాలేజీ భవనం నిర్మాణంలో ఉంది. నాలుగో అంతస్తుకు కూడా స్లాబ్ పోశారు. ఆగస్టులోగా కాలేజీ భవనం సిద్ధమవుతుంది. సొంత భవనంలోనే మెడికల్ కాలేజీని ప్రారంభించి తరగతులు ప్రారంభిస్తాం. హాస్టల్ భవనం మాత్రం అందుబాటులోకి వచ్చేందుకు కొంత సమయం పడుతుంది. ఈలోగా జిల్లా కలెక్టర్‌తో చర్చించి బాలికలకు, బాలురకు వేరువేరుగా అద్దె భవనాల్లో హాస్టళ్లను ప్రారంభిస్తాం. ఇందుకు సంబంధించి హాస్టల్ భవనాలు ఎక్కడ అనే చర్చ ఉన్నత స్థాయిలో సాగుతుంది.

55 మంది సిబ్బందిని కేటాయించారు

సిరిసిల్ల మెడికల్ కాలేజీకి ఇప్పటికే 55 మంది సిబ్బందిని కేటాయించారు. అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది కేటాయింపులు జరుగుతున్నాయి. మెడికల్ కాలేజీ ప్రారంభమైతే వంది డాక్టర్లు అందుబాటులో ఉంటారు. మొత్తం కాలేజీ సిబ్బంది సుమారు 900 మంది ఉంటారు. నాకు సిద్దిపేట మెడికల్ కాలేజీని ప్రారంభించిన అనుభవం ఉంది. సిరిసిల్లలోనూ పూర్తిస్థాయిలో మెడికల్ కాలేజీని ఈ ఏడాడి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

పిక్కలు తీస్తున్నాయి..



ముక్కు, దవడపై గాయాలతో ఉన్న ఈమెపేరు కొలుపుల మంజుల(40). బోయినపల్లి మండలం బూర్గుపల్లికి చెందిన ఈమె మార్చి 27న ఇంటి ముందు నిల్చుని ఉండగా.. పిచ్చికుక్కలు దాడి చేసి కరిచాయి. మంజులను వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇదే మండల కేంద్రంలో అదే రోజు భీవండీకి చెందిన కుసుమ లక్ష్మి(50), ఎలగందులకు చెందిన చరణ్ తేజ్(5)లపైనా కుక్కలు దాడిచేసి గాయపరిచాయి.



తలపై గాయాల పాలైన ఈ చిన్నారి పేరు బొల్లె చెరిష్మా (4). కోనరావుపేటకు చెందిన ఇస్సాక్, రూపల కూతురు. మార్చి 24న ఇంటి ఎదుట ఆడుకుంటుండగా చెరిష్మాపై కుక్కలు దాడి చేశాయి. తలపై కుక్కలు కరవడంతో ఆ చిన్నారి గాయాలపాలైంది. చిన్నారిని కరీంనగర్ ఆస్పత్రిలో చేర్పించారు.



అమాయకంగా చూస్తున్న ఈ చిన్నోడి పేరు విఘ్నేశ్(4). కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌కు చెందిన విఘ్నేశ్ తల్లిదండ్రులు నేరెళ్ల కవిత, తిరుపతి. మార్చి 18న సాయంత్రం ఇంటి ముందున్న విఘ్నేశ్‌పై కుక్కలు దాడి చేశాయి. భయంతో విఘ్నేశ్ పరుగులు తీసినా.. వెంటపడి మరీ పొట్టభాగంలో గాయాలు చేశాయి. విఘ్నేశ్‌ను వెంటనే కోనరావుపేట పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు.

- జిల్లాలో బెంబేలెత్తిస్తున్న కుక్కలు
- వణికిపోతున్న జనం..
- శాఖల మధ్య సమన్వయ లోపం
- ఎవరికీ పట్టని సమస్య
- జిల్లాలో 454 మందిని కరిచిన వైనం
- వృద్ధులు.. చిన్నారులే లక్ష్యంగా దాడులు



రాజీవ్‌నగర్ శివారుల్లో వెంటపడుతున్న కుక్కలు

సిరిసిల్ల: జిల్లాలో కుక్కల బెడద ఎక్కువైంది. ఇటీవల ఊరకుక్కల్లో కొన్ని పిచ్చి పట్టినట్లుగా వెంటపడి మరీ దాడులు చేస్తూ.. కరుస్తున్నాయి. సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో గూడెల్లి నాగభూషణం(45) తెల్లవారుజామున పేపర్ వేసి వస్తుండగా.. వెంట పడి కుక్కలు కరిచాయి. యెల్లె గోపిచరణ్(13)ను గోపాల్‌నగర్‌లో, పాత బస్టాండు వద్ద వెలిశెట్టి శంకర్(20), సంజీవయ్యనగర్‌లో బైరి దేవదాస్(55)లపై తెల్లవారుజామునే దినపత్రికలు వేస్తుండగా.. కుక్కలు దాడి చేశాయి.

ఎవరికీ పట్టని సమస్య

జిల్లావ్యాప్తంగా కుక్కల సమస్య అధికమైంది. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలత పాటు, అన్ని మేజర్, మైనర్ గ్రామాల్లోనూ కుక్కలు సంచరిస్తూ.. పలువురిని కాటేస్తున్నాయి. జనవరి నుంచి మార్చి నెల వరకు సిరిసిల్ల ఆస్పత్రిలో నమోదైన కుక్క కాటు ఘటనలు 354 ఉండగా.. మరో వంద మంది కరీంనగర్, సిద్దిపేట, కామారెడ్డి పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రిల్లో వైద్యం చేయించుకున్నారు. కుక్కలను నియంత్రించాల్సిన స్థానిక సంస్థలు ఆ సమస్యను పట్టించుకోవడం లేదు. పశుసంవర్ధక శాఖ డాక్టర్లు కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించాల్సి ఉండగా.. మా వద్దకు కుక్కలను పట్టుకొస్తే.. ఆపరేషన్ చేస్తామంటున్నారు.



కోనరావుపేట మండలం బావుసాయిపేట శివారులోని రామన్నపల్లెలో ఇటీవల గొర్రె పిల్లల దొడ్డిపై కుక్కలు దాడి చేశాయి. 15 గొర్రె పిల్లలను కొరికి చంపాయి. కుక్కల దాడితో ఆ గొర్రెల కాపరికి రూ.లక్ష వరకు నష్టం జరిగింది. మూడు నెలలు ఆగితే రూ.1.50లక్షల ఆదాయం వచ్చేదని గొర్రెల కాపరి వాపోయాడు.

ఉరికచ్చి మీదపడ్డాయి



కుక్కలు పాడుగాను ఉరికచ్చి మీదపడ్డాయి. నేను మా ఊరి గన్నారపు కిష్టయ్య, సాగర్‌లు మార్చి 22న ఇంటి ముందుండగా.. కుక్కల గుంపు వచ్చి మీద పడి కరిచాయి. కోనరావుపేట దవాఖానాకు పోయి మందులు, సూదులు వేసుకున్నాం. వాటి జోలికి పోకున్నా కరిచినయి.

– కమ్మరి పోచవ్వ, నిమ్మపల్లి

పేపర్ వేసేందుకు వెళ్లగా..



రోజూ పొద్దున్నే నేను పేపర్లు వేస్తాను. సంజీవయ్యనగర్‌కు వెళ్లగా.. కుక్కలు వెంటపడ్డాయి. తప్పించుకునే ప్రయత్నం చేసినా.. వెంటపడి మరీ కరిచాయి. అటు వైపు వెళ్లి పేపర్ వేయాలంటేనే భయం అవుతుంది. సిరిసిల్ల వీధుల్లో కుక్కల బెడద ఎక్కువైంది. గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి.

– బైరి దేవదాస్, సిరిసిల్ల

స్థానిక సంస్థలే నియంత్రించాలి



కుక్కల బెడదను స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీలు, మున్సిపల్ అధికారులు నియంత్రించాలి. కుక్కలు పట్టేందుక ప్రత్యేక బృందాలు ఉంటాయి. కుక్కలను పట్టుకొచ్చి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. మేం కుక్కలకు వైద్యం చేస్తాం. కుక్కల నియంత్రణ బాధ్యత స్థానిక సంస్థలదే.

– కొమురయ్య, జిల్లా పశువైద్యాధికారి

వడ్ల కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: యాసంగి వడ్ల కొనుగోలుకు సన్నద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో 2022–23 ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. యాసంగి సీజన్‌లో 3.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమన్నారు. ధాన్యం కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కి రూ.2060, సాధారణ రకం రూ.2040ను ప్రభుత్వం కేటాయించిందన్నారు. జిల్లాలో 259కొనుగోలు కేంద్రాల్లో ఏప్రిల్ మూడోవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ప్రతీ కొనుగోలు కేంద్రానికి టార్పాలిన్లు, ప్యాడిక్లినర్, మ్యాచర్ మీటర్లను పంపించాలని జిల్లా మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. డీసీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీఎంసీఎస్‌సీ జితేంద్రప్రసాద్, రవాణాధికారి కొండల్‌రావు, డీఏవో రణధీర్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, లీగల్ మెట్రాలజీ అధిఆకరి రూపేష్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమాదేవి ఉన్నారు.

ప్రజల చెంతకే పోలీస్ బాస్

సిరిసిల్లక్రైం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎస్పీ అఖిల్ మహాజన్ 'థానా దివస్' పేరిట కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలు, ఫిర్యాదులను పరిష్కరించడం కోసం 'థానా దివస్' ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతీనెల ఒక్కో పోలీస్‌స్టేషన్‌లో మొదటి మంగళవారం ఈ కార్యక్రమ నిర్వహణ ఉంటుందని అన్నారు. ఏప్రిల్ 4వ తేదీన వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్‌లో 'థానా దివస్' ప్రారంభిస్తామని వివరించారు. వేములవాడరూరల్ మండలపరిధిలోని అన్ని గ్రామాల ప్రజల నుంచి అర్జీలు స్వయంగా స్వీకరించి, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, గ్రామాల్లో ఉన్న సమస్యలను చట్టపరంగా పరిష్కరించనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి అందుబాటులో ఉంటానని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

వారంలోగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

- పక్షం రోజుల్లో మరో వంద పడకలు
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- జిల్లా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



జిల్లా ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్: వారంరోజుల్లోగా సిరిసిల్లలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా అందుబాటులోకి తెస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేన్సర్ నిర్ధారణ పరీక్షల విభాగం, రెండో అంతస్తులో అదనంగా వంద పడకల ఏర్పాటు పనులు పరిశీలించారు. ప్రభుత్వ వైద్యకళాశాలలో వారంరోజుల్లోగా నోరు, రొమ్ము, సర్వైకల్ తదితర కేన్సర్ల నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ఏర్పాటు జరుగుతున్నాయని తెలిపారు. ఆరోగ్య మహిళకు సంబంధించి ఏపీ టెస్టులు చేస్తున్నారు అని అధికారులతో మాట్లాడారు. రూట్‌కెనాల్ ట్రీట్‌మెంట్, నోటి కేన్సర్ల చికిత్స దంతవైద్యులదే బాధ్యతగా సూచించారు. సర్కారు ఆసుపత్రుల్లోనే డెలివరీలు జరుగాలన్నారు. పదిహేను రోజుల్లో జిల్లాసుపత్రి పై అంతస్తులో కొత్తగా 100 పడకలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రావు, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం తనిఖీ

జిల్లా కేంద్రంలోని 33వ వార్డులో నిర్వహించే కంటివెలుగు శిబిరాన్ని కలెక్టర్ అనురాగ్‌జయంతి సందర్శించారు. అవసరం ఉన్న వారందరికీ అద్దాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కౌన్సిలర్ గడ్డం లత ఉన్నారు.

టీఎల్‌ఎంలో ప్రతిభా అవార్డులు



అవార్డులు ప్రదానం చేస్తున్న డీఈఓ రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యాభివృద్ధికి అవసరమైన టీచింగ్ అండ్ లెర్నింగ్ మెటీరియల్‌ను రూపొందించిన ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ, భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్లో శుక్రవారం ప్రతిభా అవార్డులను జిల్లా విద్యాధికారి రమేశ్ ఆధ్వర్యంలో అందజేశారు. మార్చి 17న ఆన్‌లైన్‌లో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. మెరుగ్గా ఉన్న మూడింటిని అవార్డులకు ఎంపిక చేశారు. మొదటిస్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ దమ్మన్నపేట్ టి.సంపత్ కుమార్, ద్వితీయస్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ రుద్రంగి ఎం.శ్రీనివాస్, జెడ్పీహెచ్‌ఎస్ నెహ్రూనగర్ తృతీయ స్థానంలో ఏ.కీర్తిని జిల్లాస్థాయిలో ఎంపిక చేయడం జరిగింది. పద్మజ, విద్యాసాగర్, ఎంఈవో దూస రఘుపతి, నారాయణ ఉన్నారు.

డీఎల్‌పీవో మల్లికార్జున్ సరెండర్

- సస్పెండ్ చేసిన కలెక్టర్
- రుజువైన అవినీతి ఆరోపణలు
- తదుపరి చర్యలకు కమిషనరేట్‌కు సరెండర్

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్ల: జిల్లా డివిజనల్ లెవల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో) రాగంపేట మల్లికార్జున్‌ను పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు సరెండర్ చేశారు. పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం గ్రామపంచాయతీల్లో డీఎల్‌పీవో తనిఖీలు చేస్తూ.. ఏవో తప్పులు ఉన్నాయని పేర్కొంటూ.. గ్రామసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోల వద్ద డబ్బులు వసూలు చేశాడు. జిల్లాలో డీఎల్‌పీవో మల్లికార్జున్ అవినీతి చేష్టలపై 'పల్లెల్లో వసూళ్లకు చె'కింగ్' అనే శీర్షికన ఫిబ్రవరి 22న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రాథమిక విచారణ జరిపిన కలెక్టర్ అనురాగ్ జయంతి డీఎల్‌పీవో మల్లికార్జున్‌ను సస్పెండ్ చేశారు. ఆయన వసూళ్లపై జిల్లా ఆడిట్ ఆఫీసర్ స్వరూపను విచారణ అధికారిగా నియమించారు. రెండు రోజుల పాటు మార్చి మొదటి వారంలో ఆమె విచారణ జరిపారు. కొందరు సర్పంచ్‌లు డీఎల్‌పీవో వసూళ్లపై లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు ఆడిట్ ఆఫీసర్ వద్ద జరిగిన విచారణకు హాజరు కాలేదు. డీఎల్‌పీవో మల్లికార్జున్ బ్యాంకు స్టేట్‌మెంట్‌ను పరిశీలించగా.. జిల్లాలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు నేరుగానే డీఎల్‌పీవోకు డబ్బులు పంపినట్లుగా నిర్ధారణ అయింది. దీంతో జిల్లా ఆడిట్ ఆఫీసర్ స్వరూప ఇచ్చిన నివేదిక ఆధారంగా కలెక్టర్ అనురాగ్ జయంతి డీఎల్‌పీవోను పంచాయతీరాజ్ శాఖ కమిషనరేట్‌కు సరెండర్ చేశారు.



'సాక్షి'లో ఫిబ్రవరి 22న ప్రచురితమైన కథనం

క్లుప్తంగా

బ్యాటరీలు అపహరణ

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో వ్యవసాయ పంటపొలాల వద్ద ఉన్న ట్రాక్టర్ల బ్యాటరీలు, గొర్రులు, ఇతర విడిభాగాలను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన ఎనిమిది మంది రైతులకు సంబంధించిన ట్రాక్టర్ల విడిభాగాలను ఎత్తుకెళ్లారు. శుక్రవారం బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన

సిరిసిల్లటౌన్: కార్డియో పల్మనరీ రీసిసిటేషన్ (సీఆర్‌పీ)పై సిరిసిల్ల కౌన్సిలర్లకు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీ రాములు అవగాహన కల్పించారు. సత్వరమే అందించాల్సిన చికిత్సను ప్రయోగాత్మకంగా వివరించారు. చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ వెల్దండి సమ్మయ్య, తదితరలు పాల్గొన్నారు.

సిరిసిల్లఅర్బన్: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో పాత్రికేయలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కార్డియాక్ అరెస్ట్ ద్వారా క్షణాల్లో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సీపీఆర్‌తో ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి శ్రీ రాములు, డీపీఆర్వో మామిండ్ల దశరథం, తదితరులున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

సిరిసిల్ల టౌన్ : బోదకాలు నివారణలో భాగంగా శనివారం నుంచి 6 వరకు జిల్లావ్యాప్తంగా 1, 2వ తరగతి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. 60 పాఠశాలల్లోని 1540 మందికి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఫీజు చెల్లించలేదని బస్సులోంచి దించేశారు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): స్కూల్ ఫీజు కట్టలేదని ఓ విద్యార్థినిని పాఠశాల బస్ నుంచి దించేసిన ఘటన తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ బాలిక తంగళ్లపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఆర్థిక ఇబ్బందులతో తల్లిదండ్రులు ఫీజు చెల్లించలేదు. శుక్రవారం స్కూల్ బస్సుఎక్కిన చిన్నారిని డ్రైవర్ బయటకు దించేశాడు. దీంతో చిన్నారి కంటతడి పెట్టుకుంది. ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా సమాధానం ఇవ్వలేదు. గతంలోనూ పాఠశాలపై ఆరోపణలున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, విద్యా శాఖ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఫీ'జులుం'పై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్: ప్రైవేటు విద్యాసంస్థల ఫీ'జులుం'పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము కోరారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థ యాజమాన్యం ఫీజులు కట్టని విద్యార్థినిని బస్సులోంచి దింపివేయడాన్ని వైఎస్సార్‌టీపీ, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఖండించారు. మంత్రి కేటీఆర్ ఇలాకాలో జరుగుతున్న ఇలాంటి సంఘటనలపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌టీపీ నాయకులు ప్రశాంత్, అనీల్, ఎల్లయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు మంద అనీల్, మల్లారపు ప్రశాంత్, పాల్గొన్నారు.

పోషకాల 'ఫోర్టిఫైడ్'

- ఫోర్టిఫైడ్ బియ్యంతో రక్తహీనత, అలసటకు చెక్
- రేషన్‌షాపుల ద్వారా పంపిణీ
- ఈనెల నుంచి జిల్లాలో అమలు
- మంత్రి కేటీఆర్ చొరవతో పైలెట్ ప్రాజెక్టుగా జిల్లా ఎంపిక

జిల్లాలో రేషన్ దుకాణాలు
345

జిల్లాలో రేషన్ కార్డులు
1.75 లక్షలు

లబ్ధిదారులు
సుమారు ఐదు లక్షలు

ప్రతినెలా రేషన్ బియ్యం సరఫరా
3,300 టన్నులు

స్కూళ్లు, హాస్టళ్లకు ప్రతినెలా సరఫరా
200 టన్నులు


ఫోర్టిఫైడ్ బియ్యం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం..

బోయినపల్లి (చొప్పదండి): గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తోంది. మంత్రి కేటీఆర్ చొరవతో బియ్యం పంపిణీ కోసం ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎంపిక చేసింది. ఈనెల నుంచే రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు ఫోర్టిఫైడ్ బియ్యం అందించేందుకు పౌరసరఫరా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 345 రేషన్ దుకాణాలు, 1.75 లక్షల రేషన్ కార్డులుండగా ప్రతినెలా సుమారు ఐదులక్షల మంది లబ్ధి పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతినెలా సుమారు 3,300 టన్నుల బియ్యం జిల్లాలోని వివిధ రేషన్ దుకాణాలకు సరఫరా అవుతున్నాయి.

ఫోర్టిఫైడ్‌లో పోషకాలు..

ఫోర్టిఫైడ్ బియ్యంలో పలు పోషకాలుంటాయని అధికారులు చెబుతున్నారు. క్వింటాల్ బియ్యంలో ఒక కేజీ (ఒక శాతం) ఫోర్టిఫైడ్ బియ్యం కలుపుతారు. ప్రత్యేకంగా మిల్లుల్లో తయారు చేసిన ఈ బియ్యాన్ని రైస్ మిల్లులకు ఇస్తారు. రైస్‌మిల్లుల్లో రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యంలో 1శాతం ఫోర్టిఫైడ్ బియ్యం కలుపుతారు. ఈ బియ్యంలో పెద్ద మొత్తంలో విటమిన్లు లభిస్తాయని వైద్యులు చెబుతున్నారు. బియ్యంలో ఐరన్, పోలిక్ ఆసిడ్, బీ12, నిర్ధారిత మోతాదులో ఉంటాయని తెలిపారు. భోజనంలో ఫోర్టిఫైడ్ బియ్యం వాడితే రక్తహీనత, అలసట తగ్గుతుందని సూచిస్తున్నారు.

మహిళల ఆరోగ్యానికి అండ

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈమధ్య కాలంలో మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు వైద్యులు సూచిస్తున్నారు. రక్తహీనత, అలసటకు చెక్ పెట్టేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం చక్కగా పనిచేస్తాయని ప్రభుత్వం భావించింది. రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు నేరుగా బి య్యం అందించాలనే నిర్ణయానికి వచ్చారు. ఇప్పటికే పాఠశాలలు, అంగన్‌వాడీలకు ప్రభుత్వం సరఫరా చేస్తోంది.

అపోహలు వద్దు..

ఫోర్టిఫైడ్ బియ్యం వాడకంలో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని అధికారులు సూచిస్తున్నారు. మహిళలు బియ్యం ఏరేటప్పుడు ఇవి వైవిధ్యంగా కనిపించడంతో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని మెరిగెలులా తీసివేస్తారని, అలా చేయవద్దని డీఎస్‌వో జితేందర్ రెడ్డి తెలిపారు. ఫోర్టిఫైడ్ మంచి బలవర్ధకమైన ఆహారంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని వేములవాడ ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి దీప్తి తెలిపారు.

మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి



గ్రామాల్లోని మహిళలు రక్తహీనతతో బాధపడుతూ చిన్న చిన్న పనులవల్ల అలసిపోతున్నారు. ఆస్పత్రిలో చూపించుకుని వైద్యానికి పెద్దమొత్తంలో ఖర్చుచేస్తున్నారు. తినే ఆహారంలో విటమిన్ల లోపంతో రక్తహీనత ఏర్పడుతుందని ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తోంది. మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాలో అమలు కావడం విశేషం.

–కత్తెరపాక ఉమ, జెడ్పీటీసీ, బోయినపల్లి

పుష్కలమైన విటమిన్లు



ఫోర్టిఫైడ్ బియ్యంలో పలురకాల విటమిన్లు ఉంటాయి. ఐరన్, ఫోలిక్ ఆసిడ్, విటమిన్ బీ12 లాంటివి లభిస్తాయి. భోజనంలో ఈ బియ్యం వాడితే రక్తహీనత, అలసట తగ్గుతుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. మహిళలు ఎలాంటి అపోహలు నమ్మొద్దు. ఫోర్టిఫైడ్ బియ్యంతో ఆరోగ్యంగా ఉంటారు.

–డాక్టర్ దీప్తి, వేములవాడ ఏరియా ఆసుపత్రి

ఈనెల నుంచే పంపిణీ..



జిల్లాలో ఈనెల నుంచే రేషన్ దుకాణాల ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. జిల్లాలో 345 రేషన్ దుకాణాలు, 1.75 లక్షలు రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతినెలా సుమారు 5లక్షల మంది లబ్ధిపొందుతున్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తోంది. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా బియ్యం వాడాలి.

–ఎస్. జితేందర్ రెడ్డి, డీఎస్‌వో, సిరిసిల్ల

తల్లిదండ్రులకు పాదపూజ


మాట్లాడుతున్న అయాచితుల లక్ష్మణ్ రావు


పాదపూజ చేస్తున్న చిన్నారులు

సిరిసిల్ల కల్చరల్: జన్మనిచ్చిన తల్లి రుణం తీర్చుకోవడం సాధ్యం కాదని, దైవ సమానంగా భావించాలని అయాచితుల లక్ష్మణ్‌రావు అన్నారు. గాంధీనగర్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో శుక్రవారం మాతృవందనం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు మాతృ మూర్తులకు పాదపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్లతో పిల్లలకు ఆప్యాయత కరువైందన్నారు. ప్రముఖ న్యూరో ఫిజీషయన్ డాక్టర్ మంజూష మాట్లాడుతూ.. అమ్మ గొప్పదనం అంత సులువుగా అర్థం అయ్యేది కాదని, మాతృవందనం కార్యక్రమం ద్వారా పిల్లల్లో గొప్ప సంప్రదాయాన్ని నెలకొల్పేందుకు కృషి చేస్తున్న శిశుమందిర్ నిర్వాహకులను అభినందించారు. శిశుమందిర్ చేర్మెన్ చేపూరి నాగరాజు, కరస్పాండెంట్ గోగూరి నాగేందర్‌రెడ్డి మాట్లాడారు. బీజేపీ సీనియర్ నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చేర్‌పర్సన్ ఆడెపు రవిందర్, కౌన్సిలర్ గడ్డం చందన, భగవాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గొల్లపల్లి : రోడ్డు ప్రమాదంలో వెల్గటూర్ మండలం పడకల్ గ్రామానికి చెందిన రాపోలు రామచంద్రం (57) మృతిచెందినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. రామచంద్రం తన బైక్‌పై వెళ్తుండగా గొల్లపల్లి మండలం బొంకూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మైనర్లే ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు


ఇసుక ట్రాక్టర్ నడుపుతున్న మైనర్ బాలుడు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మైనర్లను ట్రాక్టర్ డ్రైవర్లుగా వాడుకుంటున్నారు. ఫలితంగా అతివేగంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని వెంకటాపూర్, నారాయణపూర్, రాగట్లపల్లి తదితర గ్రామాల్లో మానేరు వాగు నుంచి ఇసుక రవాణాకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లకు సంబంధించిన కమర్షల్ పత్రాలు, ఇన్సూరెన్స్ చూస్తున్నారే తప్పా, వాహనం నడిపే వారు మైనర్ల, మేజర్ల అని చూడడం లేదు. దీనికి బాధ్యులైన వాహన తనిఖీ అధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు చేపట్టి మైనర్లు వాహనాలు నడపకుండా చూసి ప్రమాదాలు నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: ఎన్నికలకు ముందు బీజేపి ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని మహజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఆవునూరు ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం శుక్రవారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని, వర్గీకరణ సాధించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నాయకులు ఖానాపురం లక్ష్మన్, గుండా థామస్, తంగళ్లపల్లి దేవరాజు, కమలాకర్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత


మాట్లాడుతున్న హిందూ వాహిని నాయకులు

కొండగట్టు (చొప్పదండి) : కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వా మి ఆలయంపై ఉన్న కిరాణా దుకాణంలో గు ట్కా అమ్ముతుండగా శుక్రవారం కొడిమ్యాల మండల హిందూవాహిని నాయకులు పట్టుకున్నారు. దీనిపై ఈవోకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా లేకపోవడంతో ఏఈవో బుద్ధి శ్రీనివా స్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే టెండర్ రద్దుచేసి కేసునమోదు చేయాలని డిమాండ్ చేయడంతో ఏఈవో దుకాణాన్ని మూసివేయించా రు. ఇక్కడ హిందూవాహిని కొడిమ్యాల మండల అధ్యక్షుడు కోల అనిల్‌గౌడ్, కార్యకర్తలు అరవింద్, నిఖిల్, వికాస్ పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

ధర్మపురి : ఆగి ఉన్న బైక్‌ను ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొనడంతో ముగ్గురుకి గాయాలయ్యాయి. ధర్మపురిలోని కళాశాలకు వెళ్లేందుకు శుక్రవారం దొంతాపూర్‌కు చెందిన ప్రేమలత అనే విద్యార్థిని ఆటోలో దిగి మగ్గిడి కళాశాల ఎదుట బస్సుకోసం వేచి ఉంది. పక్కనే మరో వ్యక్తి ద్విచక్రవాహనాన్ని ఆపాడు. ఎదురుగా బైక్‌పై వచ్చిన మరో యువకుడు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రేమలతకు తీవ్రగాయాలుకాగా, రంగసాగర్‌కు చెందిన తిరుపతి, ఆరెపెల్లికి చెందిన రాహుల్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గ్రామపంచాయతీలకు అవార్డులు


మంత్రుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ శ్రీధర్ పంతులు


అవార్డు అందుకుంటున్న సర్పంచ్ వనజ

గంభీరావుపేట (సిరిసిల్ల): గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికై ంది. ప్రభుత్వం ప్రకటించిన 9 కేటగిరీల్లో గంభీరావుపేట స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల విభాగంలో జాతీయ అవార్డును సా. దించింది. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతులమీదుగా సర్పంచ్ శ్రీధర్‌పంతులు అవార్డును అందుకున్నారు.

ఉత్తమ మహిళా స్నేహపూర్వక అవార్డు అందజేత..

ముస్తాబాద్ : ఉత్తమ మహిళా స్నేహపూర్వక అవార్డు మోహినికుంట దక్కించుకోగా హైదరాబాద్‌లో మంత్రులు కేటీఆర్, దయాకర్‌రావు, మల్లారెడ్డి చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ మహిళా స్నేహపూర్వక పంచాయతీగా నిలిచిన సర్పంచ్ కల్వకుంట్ల వనజకు మంత్రులు అవార్డును అందించి అభినందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, డీపీవో రవీందర్, డీఆర్‌డీవో గౌతంరెడ్డి, కల్వకుంట్ల గోపాల్‌రావు, కార్యదర్శి రాపెల్లి గీత, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


పంపిణీ చేసిన సైకిళ్లతో విద్యార్థులు

- గిఫ్ట్‌ఏ స్మైల్ ద్వారా బందనకల్ జెడ్పీ విద్యార్థులకు అందజేత

ముస్తాబాద్ (సిరిసిల్ల): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెన్నమనేని పూర్ణచందర్‌రావు జన్మదినోత్సవం సందర్భంగా ఆయన స్నేహితులు గిఫ్ట్ ఏస్మైల్ ద్వారా పేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. మండలంలోని పోతుగల్‌కు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెన్నమనేని పూర్ణచందర్‌రావు జన్మదిన వేడుకలను బందనకల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. పూర్ణచందర్ రావు స్నేహితులు బందనకల్ స్కూల్‌లో చదివే మొర్రాపూర్, వెంకట్రావుపల్లెకు చెందిన 40 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ జనగామ శరత్‌రావు మాట్లాడుతూ పూర్ణచందర్‌రావు తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, జన్మదినోత్సవం సందర్భంగా 40 మంది పేద విద్యార్థులకు సైకిళ్లను అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం కేక కట్ చేసి సంబురాలు నిర్వహించారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మంత్రి గంగుల కమలాకర్ పీఏ వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ వెంకటేశ్వరి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, విజయరామారావు, అక్కరాజు శ్రీనివాస్, యాదగిరి,వెంకటస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం రవి పాల్గొన్నారు.

గీత కార్మికుల ఆందోళన


ఆందోళన చేస్తున్న గీత కార్మికులు

చందుర్తి (వేములవాడ) : భూ ఆక్రమణకు పాల్పడ్డ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ గీత కార్మికులు శుక్రవారం చందుర్తి బస్టాండ్ వద్ద పురుగుల మందు డబ్బాతో ధర్నాచేశారు. గ్రామానికి చెందిన గీత కార్మికుల ఉపాధి కోసం ఈత, తాటి చెట్లను పెంచుకునేందుకు ప్రభుత్వం 176వ సర్వే నెంబర్‌లో భూమిని 2009వ సంవత్సరంలో తమకు పట్టాలిచ్చిందని, పక్కనే ఉన్న మరో రైతు తమ భూమిని ఆక్రమించాడంటూ వేములవాడ –కోరుట్ల ప్రధాన రహదారిపై పురుగుల మందు డబ్బాలతో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై రమేశ్ అక్కడికి చేరుకొని ఆందోళనను విరమింపజేశారు. అనంతరం తమకిచ్చిన ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్నాడని గీత కార్మికులు తహశీల్దార్ మజీద్‌కు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలంటూ గీత కార్మిక సంఘం నాయకులు గంగాధర్, కత్తి తిరుపతిగౌడ్, పులి నారాయణ గౌడ్, శంకరయ్య, రాజేశం కోరారు.

ఆటోను ఢీకొన్న వ్యాన్..

- ఆటో డ్రైవర్ మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- రాజన్న దర్శనానికి వెళ్లొస్తుండగా ఘటన


రాజయ్య (ఫైల్)


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

బోయినపల్లి (చొప్పదండి): మండలంలోని స్తంభంపల్లి గ్రామం సాయిబాబా ఆలయ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన ఒర్సు రాజయ్య (43) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజయ్య భార్య రాజేశ్వరి, తల్లి రాజవ్వ, కూతురు అక్షరతో కలిసి గురువారం వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లారు. శుక్రవారం తిరుగు ప్రయాణంలో బోయినపల్లి మండలం స్తంభంపల్లి సాయిబాబా ఆలయ సమీపం వద్దకు చేరుకోగానే వెనుకనుంచి అతివేగంగా వచ్చిన వ్యాన్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజయ్య మృతిచెందగా, తల్లి రాజవ్వ, కూతురుకు గాయాలయ్యాయి. అతివేగంగా, అజాగ్రత్తగా వ్యాన్ నడిపిన జగిత్యాలకు చెందిన డ్రైవర్ మహేశ్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మురళి తెలిపారు.

హత్యాయత్నంపై ఇద్దరిపై కేసు


వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఉపేందర్

సిరిసిల్ల క్రైం : హత్యాయత్నంపై ఇద్దరిపై ఇల్లంతకుంట పోలీసులు కేసు నమోదు చేశారు. సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 27న ఇల్లంతకుంట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో విర్లసాయి రామ్ అనే అతనిపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. దీనిపై సాయిరామ్ ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుమానితులుగా ఫిర్యాదులో పేర్కొన్న కుంటల శేఖర్, కొదాడ రఘుపై కేసు నమోదు చేసి ఎస్సై రాజేశ్ దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం ఇల్లంతకుంట శివారులో శేఖర్, కోదాడ రఘును అదుపులోకి తీసుకొని విచారించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తిగా పరిచయం చేసుకొని అసభ్యకర పదజాలంతో దూషించగా సాయిరామ్‌పై దాడి చేసినట్లు తెలిపారు. వారి నుంచి కత్తి, బైక్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని సీఐ ఉపేందర్ ప్రజలను కోరారు.